క్లుప్తంగా

'వై ఏపీ నీడ్స్ జగన్'ను జయప్రదం చేయండి

రొంపిచెర్ల: ఈ నెల 25, 26వ తేదీలలో మండలంలో నిర్వహించనున్న 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ ఇబ్రహీం ఖాన్ కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 25న 10 గంటలకు బండకిందపల్లె, 11.30 గంటలకు రొంపిచెర్ల-1, 2, బొమ్మయ్యగారిపల్లె గ్రామ సచివాలయాల పరిధిలో, 26న 10 గంటలకు గానుగచింత, 11.30 గంటలకు మోటుమల్లెల, 2 గంటలకు పెద్దమల్లెల, మధ్యాహ్నం 3.30 గంటలకు చిచ్చిలివారిపల్లె గ్రామ సచివాలయాల పరిధిలో పర్యటించి ప్రజా సమస్యలను తెలుసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమాన్ని పార్టీ ఎంపీటీసీలు, సర్పంచులు, సచివాలయ కన్వీనర్లు, సచివాలయ గృహ సారథులు, వలంటీర్లు, కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు.

24న సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు


మాదనపల్లెలోని షిరిడి సాయిబాబా

పుంగనూరు: పుంగనూరు సమీపంలోని మాదనపల్లెలోని శ్రీషిరిడిసాయిబాబా ఆలయంలో 24న మంగళవారం ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహిస్తున్నట్లు ధర్మకర్త పి.దక్షిణామూర్తి విలేకరులకు ఆదివారం తెలిపారు. షిరిడిసాయిబాబా సమాధిలోనికి ప్రవేశించిన విజయదశమి రోజున ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేస్తామన్నారు.

పంటలపై ఏనుగుల దాడి


వరి పొలంలో సంచరిస్తున్న ఏనుగు

రామకుప్పం: మండలంలోని ఎస్.గొల్లపల్లె, పీఎంకే తండా అటవీ పరిధిలో శనివారం రాత్రి పంటలపై ఏనుగులు దాడులు చేసి పంట నష్టం కలిగించాయి. అరటితోట, వరి, బీన్స్, స్వీట్‌కార్న్ పంటలను ఏనుగులు నాశనం చేసినట్లు బాధిత రైతులు వాపోయారు. అటవీ సరిహద్దులో మూడు ఏనుగులు సంచరిస్తున్నట్లు అటవీ అధికారులు తెలిపారు. రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు.


దెబ్బతిన్న వరి పంటను పరిశీలిస్తున్న అటవీ ఉద్యోగి

గుడిలో మంచినీళ్లేవి శివయ్యా!


మరమ్మతులకు గురైన బోరు మోటారు

పలమనేరు: పట్టణంలోని పురాతన కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో భక్తులకు వారంరోజులుగా మంచినీటి కష్టాలు తప్పడం లేదు. ఆలయంలో ప్రసాదాలు స్వీకరించాక చేతులు శుభ్రం చేసుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా అయ్యప్ప మాలధారణ చేసిన వారు ఆలయంలో నీటి సౌకర్యం లేక అవస్థలు పడుతున్నారు. దీనిపై భక్తులు ఇప్పటికే అక్కడి ఎండోమెంట్ అధికారులకు సమస్య నివేదించినా స్పందన కరువైంది. దేవాలయంలోని మంచినీటి మోటారు చెడిపోయింది. దానిని సిబ్బంది రిపేరు చేయించకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. ఇప్పటికైనా ఆలయ కమిటీ, ఎండోమెంట్ అధికారులు గుడిలో నీటి సౌకర్యాన్ని కల్పించాలని భక్తులు కోరుతున్నారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం



తవణంపల్లె: మండలంలోని సంతపల్లెలో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఆదివారం ప్రారంభించారు. దాత, అర్ధగిరి ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్ పైమాఘం సుగుణాకర్ రెడ్డి మండలంలోని సంతపల్లె ప్రజలకు తమ సొంత నిధులతో ఈ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ప్రజలకు పరిశుభ్రమైన స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు తమ వంతు సహకారం అందిస్తున్నట్లు సుగుణాకర్ రెడ్డి పేర్కొన్నారు. పుణ్యసముద్రంలో మినరల్ వాటర్ ప్లాంట్‌ను నిర్మించాలని ఎంపీటీసీ డేవిడ్, బుజ్జిరెడ్డి కోరారు. దీనిపై స్పందించిన సుగుణాకర్ రెడ్డి గది ఉంటే వెంటనే మెషిన్లు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు.

రెవెన్యూ శాఖలో లంచావతారులు

- చేయి తడిపితేనే పనులు.. లేదంటే ప్రదక్షిణలు
- జోరుగా వసూళ్ల పర్వం
- అనుభవ ధ్రువీకరణ పత్రాలకు పెద్ద మొత్తంలో వసూలు


కుప్పం రెవెన్యూ కార్యాలయం

కుప్పం: కుప్పం రెవెన్యూ శాఖలో అవినీతి రాజ్యమేలుతోంది. సర్టిఫికెట్లు, రీ-సర్వేల మేరకు మార్పులు-చేర్పులు చేయడానికి చేయి తడపనిదే పనులు చేయడం లేదనే విమర్శలొస్తున్నాయి. ప్రధానంగా అనుభవ ధ్రువీకరణ పత్రాలకు పెద్ద మొత్తంలో డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలు ఆ శాఖ ఉద్యోగుల పనితీరును చెబుతున్నాయి. లంచాలు డిమాండ్ చేస్తున్న అవినీతిపరుల గురించి చెబితే తమకు అవసరమైన పత్రాలు ఇవ్వరనే ఉద్దేశంతో బాధితులు శాపనార్థాలు పెట్టడం మినహా ఏం చేయలేని పరిస్థితి నెలకొంది.

వసూళ్ల జోరు

కుప్పం తహసీల్దార్ కార్యాలయంలో ఉద్యోగుల వసూళ్ల దందాకు చెక్ పడటం లేదు. ఇప్పటికే ఇద్దరు వీఆర్‌ఓలు సస్పెన్షన్ గురైనా అధికారులు, ఉద్యోగుల పనితీరులో మాత్రం మార్పేమీ లేదు. ప్రస్తుతం ప్రభుత్వం రీ-సర్వేలకు పూనుకోవడం విదితమే. ఈ సర్వేలో మార్పులు-చేర్పులకుగానీ, పొరబాట్లను సరిచేయాలని అధికారులను ఆశ్రయిస్తే వీఆర్‌ఓ నుంచి అధికారుల వరకు మామూళ్లు డిమాండ్ చేస్తున్నారని వాపోతున్నారు. అంతేకాకుండా మున్సిపాలిటీ పరిధిలో అనుభవ పత్రం కావాలంటే రూ.లక్ష పైచిలుకే ఇవ్వాలట!

అనుభవ పత్రాలకు గిరాకి

ప్రధానంగా నివాస గృహాలకు 20 ఏళ్ల అనుభవ పత్రం కలిగి ఉంటే...సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఈ స్థలం రిజిస్ట్రేషన్ చేస్తారు. దీంతో రిజిస్ట్రేషన్ ఇంటికి, స్థలానికి విలువ పెరుగుతుంది. దీంతో కుప్పం ప్రాంతంలో అనుభవ ధ్రువీకరణ పత్రాల కోసం తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కుప్పం, గుడుపల్లె మండలాల్లో డీకేటీ, గ్రామనత్తం, ప్రభుత్వ స్థలాల్లో నివాస గృహాలు అధికంగా ఉన్నాయి.అనుభవ పత్రాల ద్వారా రిజిస్ట్రేషన్ హక్కు పొందేందుకు ప్రజలు ఉద్యోగుల చుట్టూ తిరుగుతున్నారు.

వసూళ్ల పర్వంలో మచ్చుకు కొన్ని..

- మున్సిపాలిటీ పరిధిలోని డీకేపల్లెలో ఇటీవల నారాయణప్ప (పేరు మార్చాం) ఇంటి ధ్రువీకరణ పత్రం కోసం అధికారులను ఆశ్రయించారు. ఇతను తన డీకేటీ భూమిలో 30 ఏళ్ల కిత్రం ఇల్లు కట్టుకుని ఉంటున్నారు. అనుభవ ధ్రువీకరణ పత్రం పొందితే విలువ పెరుగుందని, బ్యాంకులో రుణాలు తీసుకునేందుకు అవకాశం ఉంటుందనే ఉద్దేశంతో ఆయన రెవెన్యూ అధికారులను ఆశ్రయించారు. తీరా రెవెన్యూ అధికారులు రూ.1.20లక్షలు తీసుకుని ఆయనకు ధ్రువీకరణ పత్రం ఇచ్చారని తెలిసింది. దీనిపై ప్రశ్నిస్తే.. మున్సిపాలిటీ విలువ అధికమని చెప్పి బలవంతంగా వసూలు చేసినట్లు తెలియవచ్చింది.
- గుడుపల్లె మండలం మల్లేపల్లెకు చెందిన మునెప్పకు అనుభవ ధ్రువీకరణ పత్రం కోసం గుడుపల్లె మండల తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు సంప్రదిస్తే రూ.50 వేలు డిమాండ్ చేసి, నెల పాటు కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించి..తీరా రూ.30 వేలు ముట్టజెప్పాక పట్టా ఇవ్వడం గమనార్హం!
- మున్సిపాలిటీపరిధిలోని 2వ వార్డు చీగలపల్లెకు చెందిన రాజప్పకు ప్రభుత్వం 1980లో ఇచ్చిన కాలనీ ఇళ్లు శిథిలావస్థకు చేరుకుంది. అనుభవ ధ్రువీకరణ పత్రం పొంది బ్యాంక్ రుణం తీసుకుని ఇంటిని బాగు చేసుకోవాలనే ఉద్దేశంతో అధికారులు కలిశారు. అయితే కాలనీ ఇల్లు కావడంతో పత్రం ఇవ్వడానికి రూ.30వేలు డిమాండ్ చేస్తున్నారని బాధితుడు వాపోయాడు.

ఆ ఇద్దరే కీలకం

తహసీల్దార్ కార్యాలయంలో కంప్యూటర్ విభాగంతో పనిచేస్తున్న ఇద్దరు ఉద్యోగులే వసూళ్ల పర్వంలో కీలకపాత్ర పోషిస్తున్నారు. అనుభవ ధ్రువీకరణ పత్రం, పట్టాదారు పాసుపుస్తకం, మ్యుటేషన్, ఇతరత్రా పత్రాలకు వారిద్దరు చెప్పింది ఇస్తే పని పూర్తైనట్లే ..వీరిపై విచారణ చేసి అక్రమ వసూళ్ల పర్వానికి అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

శాఖాపరమైన చర్యలు తప్పవు

అక్రమ వసూళ్లకు పాల్పడినా వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవు.అనుభవ ధ్రువీకరణ పత్రాలకు వసూళ్లు చేస్తున్నారనే సమాచారం ఉంది. ఎవరైనా బాధితులు నిర్భయంగా ఫిర్యాదు చేయవచ్చు. ఫిర్యాదు చేసిన వారి పేర్లు గోప్యంగా ఉంచి విచారణ చేయిస్తాం. చర్యలు తీసుకుంటాం. -శివయ్య, ఆర్డీఓ, కుప్పం

దసరా పూజల్లో ఎమ్మెల్యే


పాతపేట దుర్గమ్మ ఆలయంలో ఎమ్మెల్యే వెంకటేగౌడ



పలమనేరులోని పలు ఆలయాల్లో ..

పలమనేరు: నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని పలు ఆలయాల్లో అమ్మవారు ఆదివారం వివిధ అలంకారాలతో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక పాతపేట ఎస్టీకాలనీలో అమ్మవారు దుర్గాదేవిగా కటాక్షించారు. ఇక్కడ పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే వెంకటేగౌడ పాల్గొన్నారు. అలాగే, పట్టణంలోని పలు ఆలయాల్లో అమ్మవారు సరస్వతి, మహాలక్ష్మిగా అనుగ్రహించారు. కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు మండీ సుధా, చెంగారెడ్డి, ఎస్టీ నాగరాజు, హేమంత్, మునస్వామి, సుందరేష్, సరేష్, మూర్తి అముదవేణి తదితరులు పాల్గొన్నారు.

26 నుంచి కుంభాభిషేక మహోత్సవాలు



గుడిపాల: మండలంలోని 189 కొత్తపల్లె ఆది ఆంధ్రవాడలో ఈనెల 26 నుంచి 28వ తేదీ వరకు రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయ కుంభాభిషేక మహోత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. 26న ఉదయం 10.30 గంటలకు మహాగణపతి హోమం, నవగ్రహ హోమం సాయంత్రం 5.30 గంటలకు అనుగ్య, వాస్తుహోమం, అమృత్ సంగ్రహం, ప్రవేశబలి, కళాకర్షణ, కలశ స్థాపన, వేదపారాయణం, కలికోలం, గణపతి నవగ్రహ శివ, విష్ణు, ధన్వంతరి సుదర్శన ప్రథమకాల హోమం ఉంటుందని చెప్పారు. రాత్రి 7 గంటలకు కోలాటాలు, చెక్క భజనలు ఉంటాయని చెప్పారు. 27వ తేదీన 6 గంటలకు యాత్రాదాన సంకల్పం, రెండో కాల యాగశాల ప్రారంభం, 9 నుంచి 10.30 గంటల్లోగా మహాపూర్ణాహుతి, మహా గణపంతి రుక్మిణీ సత్యభామ వేణుగోపాలస్వామికి మహా కుంభాభిషేకం ఉంటుందని తెలిపారు. రాత్రి స్వామివారి ఊరేగింపు బాణసంచా వేడుకల మధ్య జరుగుతుందన్నారు. 28న రాత్రి 9 గంటలకు శ్రీకృష్ణలీలలు(కంసవధ) నాటకాన్ని ప్రదర్శించనున్నట్లు చెప్పారు.

అద్వితీయం బహురూప కళా విన్యాసం


మహతి కళాక్షేత్రంలో అన్నమయ్య సంకీర్తనను సకల కళా సమాహారంతో ప్రదర్శిస్తున్న పీఎస్‌వీ.మురళీకృష్ణ బృందం

తిరుపతి కల్చరల్: శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా మహతి కళాక్షేత్రంలో ఆదివారం రాత్రి మృదంగ విద్వాంసుడు పీఎస్‌వీ మురళీకృష్ణ ఆధ్వర్యంలో ప్రదర్శించిన వినూత్న బహురూప కళా విన్యాసం అద్వితీయంగా సాగింది. నారాయణతే నమో నమో అన్నమయ్య సంకీర్తనను ఒకే వేదికపై విభిన్న రాగాలలో 13 కళారూపాల ద్వారా 65 మంది కళాకారులతో గాత్ర, హిందూస్థానీ, లలిత, కర్ణాటక సంగీతం, పాశ్చాత్య సంగీతం, వాయిద్య సమ్మేళనం, హరికథ, నాట్యం, బుర్రకథ, నాటకం, చిత్రలేఖనం వంటి సకల కళా సమాహారంగా ప్రదర్శించి అహో అనిపించారు. అనంతరం అన్నమాచార్య కళామందిరంలో సంగీత విద్వాంసురాలు డాక్టర్ వీజే ద్వారంలక్ష్మి ప్రదర్శించిన భక్తి సంగీత కచేరి భక్తులను ఆకట్టుకుంది. శ్రీరామచంద్ర పుష్కరిణి వేదికపై అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు రాజేష్ కుమార్, కె.సుబ్రమణ్యం ప్రదర్శించిన గానామృతం సభికులను అలరించింది.

దుర్గమ్మా..కరుణించమ్మా!


గంగవరం: మేలుమాయిక్రాస్‌లో..


బైరెడ్డిపల్లె: సల్లాపురెమ్మ ఆలయంలో...

గంగవరం: మండలంలోని మేలుమాయి క్రాస్ వద్ద ఉన్న శ్రీమలాలమ్మ ఆలయంలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారు శ్రీదుర్గాదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు మొక్కులు చెల్లించారు.

శంకర్రాయలపేట దొరచెరువు కట్టపై..

పెద్దపంజాణి: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదవ రోజైన ఆదివారం మండలంలోని శంకర్రాయలపేట దొరచెరువు కట్టపై ఉన్న దుర్గమ్మ శ్రీ దుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఆలయంలోని అమ్మవారి మూలవిరాట్‌కు అర్చకులు నాగరాజ గురుకుల్ అధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. నిర్మల, దామోదర్ నాయుడు, సుబ్రమణ్యం తదితరులు ఉభయదారులుగా వ్యవహరించారు.

దుర్గాదేవి అలంకరణలో అమ్మవార్లు

బైరెడ్డిపల్లె: స్థానిక శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయం, ఎస్సీ కాలనీలోని సల్లాపురెమ్మ ఆలయం, బాటగంగమ్మ ఆలయాల్లో ఆదివారం అమ్మవారు దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.


పెద్దపంజాణి: దొరచెరువు కట్టపై..


బైరెడ్డిపల్లె: బాటగంగమ్మ ఆలయంలో..

క్రీడల్లోనూ సత్తా చాటాలి

- రాష్ట్రస్థాయి బాల్‌బాడ్మింటన్ పోటీల ప్రారంభంలో మంత్రి ఆర్‌కే రోజా



గౌరవ వందనం స్వీకరిస్తున్న మంత్రి ఆర్కే రోజా

నగరి : విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో సత్తా చాటాలని రాష్ట్ర పర్యాటక, క్రీడాశాఖ మంత్రి ఆర్‌కే రోజా అన్నారు. ఆదివారం పట్టణంలోని కేవీకే మైదానంలో 8వ రాష్ట్ర స్థాయి జూనియర్ బాల్‌బాడ్మింటన్ చాంపియన్ షిప్ పోటీలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఏ రంగంలోనైనా గెలుపుకోసం పోరాడుతూనే ఉండాలన్నారు. తప్పులు సరిదిద్దుకుంటూ పట్టుదలతో పోరాడితే అందరూ చాంపియన్లే అని తెలిపారు. నేడు ఉన్నత స్థానంలో ఉన్నవారందరూ ఎప్పుడో ఒకసారి ఓటమిని చూసినవారేనని పేర్కొన్నారు. క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొనాలన్నారు. ఆడినా, ఓడినా రికార్డుల్లో ఉంటారని గెలిస్తే చరిత్రలో ఉంటారని తెలిపారు. క్రీడలు ఆరోగ్యంతో పాటు ఏకాగ్రతను, సహకరించే గుణాన్ని, బాధ్యతను అలవరిస్తాయన్నారు. ఉద్యోగ అవకాశాలను కల్పించడంతో పాటు ధైర్యంగా పదిమందికి స్ఫూర్తిగా నిలిచే అవకాశం ఉంటుందని, అందుకే క్రీడలను తాను ఎప్పుడూ ప్రోత్సహిస్తానని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికై జాతీయ పోటీల్లో పేరుప్రతిష్టలు తేవాలన్నారు. కార్యక్రమంలో రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్కే సెల్వమణి, మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, డీఈఓ శేఖర్, సీఈఓ సెట్విన్ మురళీకృష్ణారెడ్డి, తిరుపతి సిద్ధార్థ, రాయలసీమ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్ నిర్వాహకులు ఆనందరెడ్డి, నగరి, పుత్తూరు, నిండ్ర ఎంపీపీ భార్గవి, మునివేలు, దీప తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులతో మంత్రి ఆర్కే రోజా

వార్డు మెంబర్ల ఆత్మీయ సమావేశం



పాకాల: భారతంమిట్టలో పంచాయతీ వైస్ సర్పంచ్ ప్రకాష్‌రెడ్డి నివాసంలో విజయదశమి సందర్భంగా ఆదివారం వార్డు మెంబర్ల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా చంద్రగిరి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తనయుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా హర్షిత్‌రెడ్డి మాట్లాడుతూ పంచాయతీలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేశారని, ఇంకా జరగాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు ఉంటే తన దృష్టికి తీసుకుని రావాలని, తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని వివరించారు. అనంతరం ప్రతీ వార్డు మెంబర్‌కు దుస్తులు, పండ్లు, స్వీట్స్ అందజేసి, విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. సర్పంచ్ ఎస్.కస్తూరి, ఎంపీటీసీలు స్వర్ణ, పార్టీ కన్వీనర్ నంగా నరేష్‌రెడ్డి, నంగా కపిలేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



PALAMANER MUNICIPALITY

Roc.No :247/2022/E1 Dt:21.10.2023

'e' Procurement Tender Notice

Tender Notice Nit No: 47 to 80 Rs.363.83 Lakhs

1. No. of Works GGMP & General Funds	: 33 Nos
2. T.S.Amount / E.C.V. Amount	: **Rs.363.83 Lakhs**
3.Bid Document Downloading Starting Date	: 21.10.2023 at 04.00 P.M
4.Bid Document Downloading End Date	: 06.11.2023 at 03.00 P.M
5.Bid Submission Closing Date	: 06.11.2023 at 03.30 P.M
6.Price Bid Opening Date	: 06.11.2023 at 03.31 P.M
7.Name & Address of the Concerned Officer	: Commissioner, Palamner Municipality, Palamaner-517408

Further details can be seen @ e-procurement market place at https://tender.apeprocurement.gov.in from **21.10.2023 at 04.00 P.M.**

Sd/- **COMMISSIONER**, Palamaner Municipality, Chittoor District.





